క్లుప్తంగా...

నేడు ఏసీపీ కార్యాలయం ప్రారంభం

మేడ్చల్: మేడ్చల్‌లో ఏర్పాటు చేసిన మేడ్చల్ ఏసీపీ నూతన కార్యాలయాన్ని మంత్రి మల్లారెడ్డి సోమవారం ప్రారంభిస్తారని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహారెడ్డి తెలిపారు. పోలీస్ క్వార్టర్స్ వద్ద ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని మంత్రి మల్లారెడ్డి ఉదయం 10గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు. 20వ వార్డులో సీసీ కెమెరాలను ప్రారంభిస్తారని తెలిపారు.

రైలు ప్రమాద మృతులకు నివాళి



మేడ్చల్‌రూరల్: ఒరిస్సా బాలాసోర్ రైలు ప్రమాదంలో మృతి చెందిన వారికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. బీజేపీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వినర్ అమరం మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గుండ్లపోచంపల్లి మున్సిపల్ కార్యాలయంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అనంతరం మున్సిపల్ కార్యాలయం సమీపంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అమరం సరస్వతి, బీజేపీ నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రేసింగ్ ప్రతిభను వెలికితీయడమే ఆర్‌పీపీఎల్ లక్ష్యం



ఫోర్ స్ట్రోక్ సూపర్ సిరీస్‌లో విజేతలు

శామీర్‌పేట్: యువకుల్లోని రేసింగ్ ప్రతిభను వెలికితీయడమే లక్ష్యంగా ఆర్‌పీపీఎల్ కృషిచేస్తోందని సీఎండీ అఖిల్‌రెడ్డి అన్నారు. శామీర్‌పేట్ లియోనియాలో గల చికేన్ స్క్వాట్‌లో ఆర్‌పీపీఎల్ (రేసింగ్ ప్రమోషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో కార్టింగ్ సూపర్ సిరీస్ ఫైనల్స్ ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. దేశంలోని చెన్నై, బెంగళూరు, కేరళ, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ పట్టణాల్లోని రేసర్లు ఈ లీగ్‌లో వివిధ దశల్లో పోటీపడ్డారని, ఆదివారం 24 మంది రేసర్లకు ఫైనల్ లీగ్ నిర్వహించగా ఫోర్ స్ట్రోక్ సూపర్ సిరీస్ ఛాంపియన్‌గా రచిత్ సింఘాల్ విజయం సాధించాడన్నారు. హైదరాబాద్ బ్లాక్ బర్డ్స్‌కు చెందిన అఖిల్ రవీంద్ర డ్రైవర్స్ టైటిల్ గెలుచుకోగా, గాడ్ స్పీడ్ కొచ్చి జట్టు ఛాంపియన్‌షిప్ ట్రోఫీని గెలుచుకుంది. భారతదేశం తరపున అంతర్జాతీయ స్థాయి కార్టింగ్ పోటీలకు తలపడే రేసర్‌కు ఆర్‌పీపీఎల్ స్కాలర్‌షిప్ అందిస్తుందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మేడ్చల్‌రూరల్: వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం మండలంలోని రేకులబావి సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు దాటుతున్న మహారాష్ట్రకు చెందిన ఆనంద్(32)ను తూప్రాన్ నుంచి నగరం వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో తీవ్రగాయాలపాలైన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని ప్రమాద తీరు పరిశీలించారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని యువకుడు..

మేడ్చల్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా మరొకరు గాయాలపాలైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి లక్ష్మీనగర్ కాలనీకి చెందిన శివశంకర్(19) మిత్రుడు సాయిప్రకాశ్‌తో కలిసి ద్విచక్రవాహనంపై కండ్లకోయలోని సాయిగీత ఆశ్రమం నుంచి కండ్లకోయ వైపు వస్తుండగా కండ్లకోయ చౌరస్తా వద్ద జాతీయ రహదారిపై వీరి బైక్‌ను బస్సు ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన శివశంకర్ అక్కడికక్కడే మృతి చెందగా సాయిప్రకాశ్ గాయాలపాలయ్యాడు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. శివశంకర్ మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జన చైతన్య సేవా సమితి సేవలు భేష్

ఘట్‌కేసర్: జనచైతన్య సేవా సమితి, స్ట్రీట్ బర్డ్స్ సేవలు అభినందనీయమని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి అన్నారు. పట్టణంలోని బస్సు ప్రయాణ ప్రాంగణంలో ఎస్సైలు అశోక్, ధనంజయతో కలిసి ఆదివారం మజ్జిగ పంపిణీ చేశారు. అనంతరం సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యాదగిరియాదవ్‌ను శాలువాతో సత్కరించారు. కౌన్సిలర్లు శశికళ, మల్లేశ్, పద్మారావు, జహంగీర్, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, నాయకులు రాధాకృష్ణముదిరాజ్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంపుపై నజర్

- శివారు పురపాలికల్లో వసతుల కల్పనపై చర్యలు
- ఆదాయానికి గండి కొడుతున్న ఉద్యోగులపై కన్ను
- పట్టణాల్లో పన్నుల రాబడి రూ.400 కోట్ల పెంపునకు కసరత్తు
- ట్రేడ్ లైసెన్సు, ఖాళీ స్థలాల పన్నుల వసూళ్లపై కార్యాచరణ



పీర్జాదిగూడ నగర పాలక సంస్థ కార్యాలయం

సాక్షి, మేడ్చల్ జిల్లా: గ్రేటర్ శివారు పురపాలికల్లో ఆదాయం పెంపుతో పట్టణవాసులకు మహానగరానికి సమాంతరంగా మౌలిక వసతుల కల్పనకు అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రజలపై భారం పడకుండా.. ఆదాయ వనరుల సమీకరణ లక్ష్యంగా పురపాలికల్లో సంపద బృహత్తర వనాలను పెంచడం వంటి పలు కార్యక్రమాలపై చొరవ చూపుతున్న అధికార గణం ట్రేడ్ లైసెన్సు, ఖాళీల స్థలాల పన్ను(వెకంటీ టాక్స్)లపై కార్యాచరణకు సిద్ధమవుతోంది. శివారు పురపాలికల్లో ప్రస్తుతం వివిధ పన్నుల ద్వారా రాబడి రూ.343 కోట్లు ఉండగా, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో రూ.400 కోట్లకు పెంచాలని భావిస్తున్నారు. గ్రేటర్ శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 28 పురపాలక సంఘాల్లో ఆదాయ మార్గాలు పెంచుకోవడానికి అన్ని రకాల వనరులను వినియోగించుకోవాల్సి ఉన్నప్పటికీ.. దానికి కొందరు ఉద్యోగులు గండి కొట్టేలా వ్యవహరిస్తున్న తీరుపై కూడా కన్నేయాలని భావిస్తోంది. పురపాలికల్లో ఇప్పటికే కొత్తగా ఇళ్లు నిర్మించుకుంటే అనుమతులు, ఇంటిపన్ను, నల్లా పన్నుల మదింపు వంటివి చేస్తుండటంతో పాటు వాణిజ్య, వ్యాపార సంస్థల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ జారీ చేయడం తప్పనిసరి చేశారు. ట్రేడ్ లైసెన్సు జారీలో పలువురు ఉద్యోగులు చేతివాటం ప్రదర్శించడం వల్ల లక్ష్యానికి తగ్గట్టుగా ఆదాయం రావడం లేదు. ఖాళీ స్థలాల పన్ను విధింపుతో కొంత మేరలో ఆదాయం వనరులను పెంచవచ్చని అధికార యంత్రాంగం యోచిస్తోంది.

ఖాళీ స్థలాలపై పన్ను..

నగర శివారు పురపాలికల్లో ఎలాంటి నిర్మాణాలు లేని ఖాళీ స్థలాల ప్లాట్లు కోకొలల్లుగా ఉన్నాయి. వీటిని సంబంధిత యాజమానులు, పురపాలక సంఘాలు పట్టించుకోకపోవడంతో చెట్ల పొదలు, చెత్తా చెదారం, మురుగు నీరుతో నిండి పందులు, దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలపై పన్ను మదింపుతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆదాయం పెంచుకోవచ్చని భావిస్తున్నారు. ప్లాట్లపై యాజమానులకు బాధ్యతను గుర్తు చేయడం ద్వారా పరిశుభ్రతపై అవగాహన పెంచవచ్చని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

ఫీజుతో పాటు అదనంగా..

గ్రేటర్ శివారులో 28 పురపాలక సంఘాల పరిధిలోని దుకాణాలు, హోటళ్లు, ఆస్పత్రులు, ఇతర షాపింగ్ మాల్స్ వంటి అన్ని రకాల దుకాణాలకు ట్రేడ్ లైసెన్స్ అవసరముంది. వీరంతా ఆన్‌లైన్ తర్వాత అనుమతులు పొందుతున్నారు. రహదారులను బట్టి పొడవు, వెడల్పుల ఆధారంగా పన్ను వసూలు చేయాలి. కానీ నగర శివారు పరిధిలో పదుల సంఖ్యలో వాణిజ్య దుకాణాలు ఉండగా పొడవు, వెడల్పు కొలతలు లేకుండానే ఫీజులు నిర్ణయించి, చేతివాటం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది.

ట్రేడ్ లైసెన్సు జారీ ఇలా..

నగర శివారుల్లో వ్యాపారం నిర్వహించాలంటే.. పురపాలక సంఘానికి రుసుం చెల్లించి ట్రేడ్ లైసెన్సు పొందాలి. రుసుం విధింపులో ఇటీవల కొత్త విధానం అమల్లోకి వచ్చింది. షోరూంలు, మిల్లులు, సరుకు నిల్వ చేసే హోల్‌సేల్ వర్తకుల భవన సముదాయాల విస్తీర్ణం ఎక్కువగా ఉంటుంది. కొత్త విధానంలో మదింపు చేస్తే వీరు రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించాల్సి ఉంటుంది. కొందరు లైసెన్సు పొంది తిరిగి పునరుద్ధరించడంలేదు.

మచ్చుకు కొన్ని..

జవహర్‌నగర్, బోడుప్పల్, పోచారం, నిజాంపేట, దుండిగల్, కొంపల్లి, నాగారం పురపాలక సంఘాల్లో 11,056 వ్యాపార సముదాయాలకు ట్రేడ్ లైసెన్సులు 3,998 మాత్రమే ఉన్నాయి. వీటిలో గుర్తించిన 7,058 వ్యాపార సముదాయాలకు కూడా ట్రేడ్ లైసెన్సులు ఇవ్వలేదు. ఇంకా గుర్తించని వ్యాపార సముదాయాలు ఎన్ని ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పురపాలికల్లో ట్రేడ్ లైసెన్సుల జారీ విధానం ఏ విధంగా ఉందో విదితవుతోంది. ఉదాహరణకు నిజాంపేటలో 4,354 వ్యాపార సముదాయాలకు 2,135 ట్రేడ్ లైసెన్సులు మాత్రమే జారీ చేశారు. బోడుప్పల్‌లో 2,035గానూ 455 ట్రేడ్ లైసెన్సులు, జవహర్‌నగర్‌లో 750 గానూ 282, దుండిగల్‌లో 1,248 గానూ 432, కొంపల్లిలో 1,047 గానూ 256, నాగారంలో 1211గానూ 265 ట్రేడ్ లైసెన్సులు ఉన్నాయి. ఇదే పరిస్థితి మిగిలిన పురపాలక సంఘాల్లో కూడా ఉందన్న అభిప్రాయాలు లేకపోలేదు.

దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ పాల్గొనాలి

జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ అమయ్ కుమార్



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అమయ్ కుమార్

సాక్షి,మేడ్చల్ జిల్లా: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, డీఆర్‌ఓ లింగ్యానాయక్‌తో కలిసి జిల్లా ప్రత్యేక అధికారులు, నియోజకవర్గస్థాయి అధికారులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ నెల 9న సంక్షేమ సంబురాలు, 13న మహిళా దినోత్సవం కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించి ఇప్పటి నుంచే యాక్షన్ ప్లాన్‌తోపాటు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికీ అందుతున్నాయని, ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన ఆవశ్యకత అధికారులు, ప్రజాప్రతినిధులపై ఉందన్నారు. సంక్షేమ సంబురాల్లో భాగంగా ఆసరా పింఛన్లు, కల్యాణ లక్ష్మి పథకాన్ని పొందిన వెయ్యి మంది పాల్గొనేలా సభ నిర్వహించాలన్నారు. సదస్సులో అంగన్‌వాడీ టీచర్లు, సెర్ప్ సిబ్బందితో పాటు ఇతరులు పాల్గొనేలా చూడాలని జిల్లా సంక్షేమాధికారి పావనిని కలెక్టర్ ఆదేశించారు. సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్ అగస్త్య, జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, జిల్లా సంక్షేమాధికారి పావని, జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, కీసర ఆర్డీవో రవి, ప్రత్యేక అధికారులు, నియోజకవర్గస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పోలీసుల సేవలు భేష్..

శాంతిభద్రతల పరిరక్షణ, స్నేహపూర్వక విధానం, సమర్థవంతమైన సేవలతో ప్రజలకు ప్రశాంత వాతావరణాన్ని కల్పిస్తూ పోలీసులు ముందుకు సాగుతున్నారని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కలెక్టరేట్‌లో సురక్ష దినోత్సవ సంబురాలు నిర్వహించారు. పోలీసు స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసు వ్యవస్థ అమలు అవుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణలో పటిష్ట వ్యవస్థతో కూడిన కౌంటర్ ఇంటెలిజెన్స్ విభాగం యావత్ దేశంలోనే అగ్రస్థానంలో నిలుస్తోందని అభినందించారు. షీ-టీమ్స్, ప్రతిచోటా పెట్రోలింగ్ కార్స్, బ్లూ కోట్స్, ఫైర్ వెహికిల్స్ అందుబాటులో ఉండటం వల్ల ప్రజలకు మేలు జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో జెండా ఊపి హెడ్ క్వార్టర్స్ నుంచి ర్యాలీని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్, డీఆర్‌ఓ లింగ్యానాయక్, డీసీపీ సందీప్, ఏసీపీ రామలింగ రాజు, పోలీస్ సిబ్బంది, జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఫొటో ఎగ్జిబిషన్, డాక్యుమెంటరీలు

దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, డాక్యుమెంటేషన్ ఎంతో బాగున్నాయని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. ఆదివారం కలెక్టర్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, డాక్యుమెంటరీలను జిల్లా అదనపు కలెక్టర్లు నర్సింహారెడ్డి, అభిషేక్, డీఆర్‌ఓ లింగ్యానాయక్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌లో పదేళ్ల క్రితం ఉన్న పరిస్థితి.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి తెలియజేసేలా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, డాక్యుమెంటరీలను ఆయన తిలకించారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తూ..



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తూ..

మంత్రి పాలమ్మితే.. పూలమ్మితే.. మనకేంది..?

- చేసేది తక్కువ.. చెప్పేది ఎక్కువ
- ప్రజలకు ఏమి చేస్తడో చెప్పాలి
- మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధీర్‌రెడ్డి



ప్రతాపసింగారంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఘట్‌కేసర్: మంత్రి మల్లారెడ్డి పాలమ్మితే కనకేంది.. పూలమ్మితే మనకేంది.. మనకేం చేస్తడో చెప్పాలే.. చేసేది తక్కువ.. చెప్పేది ఎక్కువ అంటూ సొంత పార్టీ మంత్రిని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి విమర్శించారు. ప్రతాపసింగారం రైతు వేదిక ఆవరణలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణరావు కాలువలో జంతువుల కళేబరాలు వేయడంతో దుర్వాసన వస్తోందని, కాలువ కూరుకుపోయి సాగునీరు అందడం లేదని, డ్రైనేజీ, రసాయన నీటితో ప్రజలు అనారోగ్యం పాలువుతున్నారని రైతులు సమస్యలపై ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరించే సత్తా ఆయనకుందని, అక్కడక్కడా తిరుగుతడు ఇక్కడ రావాలంటే.. భయపడతడని విమర్శించారు. మనందరం ఏదో వ్యవసాయం ఇతర కార్యకలాపాలు చేసి పైకి వచ్చినోళ్లమే.., మనలో చాలామంది పాలమ్మితే, పూలమ్మితే రాలేదు. సైకిల్ మీద పాలు కొట్టింద్రు.. కోట్లేమీ రాలేదు.. ఆయనకు ఎట్లచ్చినవో భగవంతుడికి తెలుసన్నాడు. మంత్రి మల్లారెడ్డికి రైతుల సమస్యలు పట్టవని, రైతు సమస్యలపై సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని తెలిపారు. అవసరమైతే అన్నదాతల సమస్యల పరిష్కారానికి ధర్నా చేపడదామని అన్నారు.

ఉచిత వైద్య శిబిరాలకు స్పందన



నాగారం 9వ వార్డులో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు విజయపురి కాలనీలో శ్రీధరణి ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. సుమారు 50 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, కాలనీఅధ్యక్షుడు సత్యం రాజు, డాక్టర్లు సౌమ్య, శ్రేయాన్స్, తేజ, శ్రీనివాస్‌గౌడ్, కాలనీవాసులు చెండి శ్రీనివాస్, యాదయ్య, ప్రభాకర్, కనకయ్య, సోమరాజు, కూచిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అహ్మద్‌గూడలో..

దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఆదివారం సాయి మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కౌన్సిలర్ కొత్త సురేఖాభాస్కర్‌గౌడ్, వైద్యులు సాయిబాలు, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.



అహ్మద్‌గూడ 5వ వార్డులో..

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి



సురక్ష దినోత్సవంలో మాట్లాడుతున్న సీఐ మహేందర్‌రెడ్డి

ఘట్‌కేసర్: నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సీఐ మహేందర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా స్థానిక ఎస్వీఎస్ గార్డెన్‌లో ఆదివారం నిర్వహించిన సురక్ష దినోత్సవంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి పోలీస్ వ్యవస్థ పనితీరుపై మాట్లాడారు. తొమ్మిదేళ్లలో షీటీమ్, కమాండ్ కంట్రోల్ రూం, 100 డయల్ కాల్‌తో మెరుగైన, ఫ్రెండ్లీ పోలీస్ సేవలు అందించామని అన్నారు. ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ 24 గంటల పాటు సమయం కేటాయిస్తూ సేవలు అందిస్తున్న పోలీస్ అధికారులు, సిబ్బందికి ఇవ్వాల్సిన పీఆర్సీ, డీఏ పాటు ఇతర అలవెన్సులను సకాలంలో అందజేయాలన్నారు. అనంతరం వైస్ చైర్మన్ మాధవరెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్ పోలీస్ అధికారులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, రైతు బంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, కౌన్సిలర్లు రమాదేవి, ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, జహంగీర్, నరేశ్‌యాదవ్, నర్సింగ్‌రావు, రవీందర్, ఎస్సైలు నాగార్జునరెడ్డి, ధనంజయ, సుధాకర్‌గౌడ్, ఏఎస్సై ఇంద్రారెడ్డి పాల్గొన్నారు.



ఫ్రెండ్లీ పోలీస్ గురించి వివరిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

అన్నోజిగూడలో సురక్షా దినోత్సవం

పోచారం: అన్నోజిగూడలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సురక్షా దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చైర్మన్ కొండల్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ శాఖ నేర నియంత్రణలో దేశంలోనే నెంబర్ వన్‌గా గుర్తింపు తెచ్చుకుందన్నారు. సీఐ వి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ పోలీస్ ఫ్రెండ్లీ పోలీస్‌గా పనిచేస్తోందన్నారు. వైస్ చైర్మన్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, చింతల రాజశేఖర్, బీఆర్ఎస్ పోచారం మున్సిపాలిటీ ప్రధాన కార్యదర్శి నల్లవెళ్లి శేఖర్, సామల బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



పోచారం: తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ రాజీవ్‌సాగర్‌ను దశాబ్ది ఉత్సవాల సందర్భంగా పోచారం మున్సిపల్ కౌన్సిలర్ చింతల రాజశేఖర్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. బొకే అందజేసి శాలువాతో సత్కరించారు. రాజీవ్ సాగర్ మాట్లాడుతూ.. అన్ని రంగాల్లో రాష్ట్రం ప్రగతి సాధించి దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు.

ప్రజల రక్షణ, శాంతిభద్రతలే పోలీస్ లక్ష్యం

జవహర్‌నగర్ ఎస్ఐ అనిల్‌రెడ్డి



ఎస్ఐ అనిల్‌రెడ్డిని సన్మానిస్తున్న నాచారం ఫైర్ విక్టమ్స్ కాలనీవాసులు

జవహర్‌నగర్: ప్రజల రక్షణ, శాంతి భద్రతలే పోలీస్ లక్ష్యమని జవహర్‌నగర్ ఎస్ఐ అనిల్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా రాచకొండ జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ సమక్షంలో ఆదివారం నాచారం ఫైర్ విక్టమ్స్ కాలనీ అధ్యక్షుడు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో 'సురక్ష దివస్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ అనిల్‌రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది ఉద్యమకారుల పోరాటాల ఫలితాలు, అమరవీరుల త్యాగాల ఫలితమే నేటి తెలంగాణ అన్నారు. పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని బంగారు తెలంగాణగా మార్చేందుకు పోలీస్‌శాఖ కూడా బాధ్యతగా పనిచేస్తోందని వివరించారు. ధనిక, పేద తేడా లేకుండా అందరికీ ఒకే రకమైన సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్‌సీ కాలనీ కమిటీ సభ్యులు దశరథ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అవినాష్‌రాథోడ్, అర్జున్, పరమేష్‌చారి, అంజన్‌కుమార్, నర్సింహ, సాయి, ఇఫ్తాకర్, స్వామి కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి నిరంతరం పనిచేస్తాం



నారాయణను సన్మానిస్తున్న కార్మికులు, కార్మిక నేతలు

మేడ్చల్: రాష్ట్రంలోని కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పని చేస్తానని రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ నారయణ అన్నారు. మేడ్చల్‌లోని మంత్రి క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్‌టీయూ సన్మాన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. తాను కార్మికుల కోసం చేస్తున్న కృషిని గుర్తించిన సీఎం కేసీఆర్ తనను రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్‌గా నియమించారని ఆయన అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న కార్మిక సంక్షేమ పథకాల ఫలాలను కార్మికులకు అందేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా బీఆర్‌టీయూ అధ్యక్షుడు సంబు ప్రభాకర్, కౌన్సిలర్ మణికంఠ, నాయకులు సంజీవరావు, సిరాజుద్దీన్, రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చారీ, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ పద్మశాలి సంఘం నూతన కమిటీ



నాగారం మున్సిపాలిటీ పద్మశాలి సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా ఎంపికైన కూరపాటి నాగేశ్వరరావు

కీసర: నాగారం మున్సిపాలిటీ పద్మశాలి సంఘం నూతన కమిటీని ఆదివారం ఎంపిక చేశారు. ఈమేరకు ఆదివారం మున్సిపల్ పరిధిలోని స్నేహపూరి కాలనీలో నిర్వహించిన సమావేశంలో నాగారం మున్సిపల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడిగా కూరపాటి నాగేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కూరపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలకు అనుగుణంగా సంఘం సంక్షేమానికి కృషిచేస్తానని, సంఘం సభ్యుల సహకారంతో సంఘాన్ని అభివృద్ధి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నాగారం మున్సిపాలిటీలోని పద్మశాలి కులస్తులంతా ఐక్యతతో ముందుకెళ్దామని అన్నారు. నాగారం మున్సిపాలిటీ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులుగా రమేష్, మధుసూదన్, ప్రధాన కార్యదర్శులుగా నర్సింగ్, వాస వెంకటేషం, కోశాధికారులుగా ఇరుకుల శ్రీనివాస్, పవన్, ముఖ్యసలహాదారులుగా మంత్రి వెంకటేషం, లక్ష్మీనారాయణ, రవి, సహాయ కార్యదర్శులుగా పెంట చంద్రమౌళి, ఆనందం, అశోక్, మహిళసభ్యులుగా చంద్రకళతోపాటు కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మీడియా అధ్యక్షుడిగా ఎన్నికైన బొమ్మ అమరేందర్‌ను సంఘం తరపున ఘనంగా సత్కరించారు.

కీసరలో భారీ వర్షం



కీసరలో రహదారులపై విరిగిన చెట్ల కొమ్మలు

కీసర: కీసర మండలంలోని వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులతో కీసర-కుషాయిగూడ, కీసర- కీసరగుట్ట రహదారుల్లో కొన్నిచోట్ల చెట్లకొమ్మలు విరిగి రోడ్డుకు అడ్డంగా పడిపోయాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. పంచాయతీ సిబ్బంది కొమ్మలను జేసీబీ, డోజర్ల సహాయంతో తొలగించారు.



కొమ్మలను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది